# కాదనగలమా?

## బలభద్రపాత్రుని రమణి

మనకి ఎవరితోనైనా పోట్లాట అవుతుంటే, ఇరువర్గాల వాదనా గొప్ప ఓర్పుతో విని అర్థం చేసుకునేవాడు మాత్రం మన పక్కింటివాడు! ఇది ముమ్మాటికీ నిజం. మనింట్లో గొడవ జరుగుతున్నంతసేపూ అతనికి బయట వరండాలో పెట్టిన క్రోటన్స్ కుండీల దగ్గరో, లేక కిటికీ దగ్గరో నిలబడి దువ్వెనలలోంచి మకిలి తియ్యడంలాంటిదేదో చేయాల్సొస్తుంది. అతని తప్పేమీ లేదు. రేపు వాళ్లింట్లో పోట్లాట సంభవిస్తే మనకీ ఆ డ్యూటీ తప్పదు! ఇప్పుడు నా పరిస్థితి అచ్చు పక్కింటివాడిలా తయారయింది.

గీతా పిల్లై రాకేష్ పండిట్‌ని నోటికొచ్చినట్లల్లా తిట్టిపోస్తోంది. నేను వినకూడని మాటలు కూడా వినాల్సొస్తోంది. జాతీయ సమైక్యతని సూచిస్తూ హిందీ, ఇంగ్లీషులోనే కాకుండా మధ్యమధ్యలో అరవంలో కూడా




తిట్టిపోస్తోంది. అవి అర్థం కాని అతగాడు నా వైపు క్వొశ్చన్‌మార్కు ఫేస్ పెట్టి చూస్తున్నాడు. అవి అర్థం విప్పి చెప్పేటంత సొగసైనవేం కాకపోవడంచేత నేను వెర్రి నవ్వొకటి నవ్వేస్తున్నాను.

తిట్టి తిట్టి ఆమె నోరు నొప్పి పుట్టి శాండిల్స్ టకటకలాడించుకుంటూ "ఇంక నీ మొహం జన్మలో చూడద్దనుకుంటున్నాను!" అని వెళ్లిపోయింది.

ఆమె వెళ్లిపోయాక రాకేష్ నాతో "బాభీ! నేను కావాలని చేయలేదు!" అన్నాడు.

"ప్రేమలో ఇవన్నీ మామూలే!" నేను నవ్వాను.

రాకేష్, గీత పేరెంట్స్‌ని కలుస్తానని చెప్పి మాటిచ్చి ఆ టైమ్‌కి వెళ్లలేకపోవడం ఇది మూడవసారి. అసలే మేజర్‌గా రిటైర్ అయిన గీత తండ్రికి రాకేష్‌ని అల్లుడిగా డిస్‌క్వాలిఫై చేయడానికి ఇదో పెద్ద కారణమైంది.

"ఫర్‌గెట్ ఎబౌట్ హిమ్ చైల్డ్!" అని డిక్లేర్ చేసి తాపీగా పైప్ కాలుస్తూ వెళ్లిపోయాడు.

నాగపూర్‌లో ఇంజనీరింగ్ చేస్తున్నప్పుడు మొగ్గతొడిగిన గీతా, రాకేష్‌ల స్నేహం బెంగుళూరులో ప్రాజెక్ట్ వర్క్‌కోసం వెళ్లినప్పుడు రేకు విడిచి హైదరాబాదులో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో సెటిలయ్యాక ప్రేమగా పుష్పించింది. ఇద్దరూ ఘాటుగా ప్రేమించేసుకుంటూ.. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్స్‌లో, డిస్కో క్లబ్బుల్లో కడదాకా కలిసే ఉండాలని బాసలు చేసేసుకున్నారు. ఈ విషయం రాకేష్, మిత్రుడైన మా ఆయనకే మొదటగా చెప్పారు. ఆయన ఎక్స్‌క్లమేటరీ మార్క్ మొహం పెట్టి, "హౌ ఈజ్ ఇట్ పాజిబుల్ యార్! ఆ అమ్మాయి పిల్లె ... నువ్వు పండిట్!" అన్నారు.

'ఫైర్' లాంటి సినిమాలొస్తున్న ఈ రోజుల్లో 'కులగోత్రాలు' సినిమా చూస్తున్నట్లనిపించింది నాకు.

"నీదంతా చాదస్తం!" అన్నాను మా హబ్బీతో చిరాగ్గా.

ఆయన భుజాలెగరేసి "వెల్ ... మీ ఇష్టం!" అన్నారు.

"కాకపోతే నీ ఇష్టమా? ఏదో జస్ట్ ఫర్ ఇన్‌ఫర్మేషన్ సేక్ చెప్పారంతే!" అన్నాను.

అలా దినదినప్రవర్ధమానమైన వాళ్ల ప్రణయం వివాహంగా మారాలని నిశ్చయించుకున్నాక గీత వాళ్ల డాడీకి ఫోన్‌లో చెప్పింది. డిసిప్లిన్ అంటే ప్రాణం పెట్టే రామనాథన్ పిళ్లై చెన్నై నుండి సరిగ్గా ఒక్క రోజుకోసం హైదరాబాదు వచ్చాడు.

'తానొకటి తలిస్తే దైవమొకటి ..' అన్నట్లుగా రాకేష్ ఎవరో ఫ్రెండ్‌కి ఏక్సిడెంట్ అయిందని ఎవరితో చెప్పా పెట్టకుండా ఫ్లయిట్‌లో ముంబై

ఆమె వేసుకున్న కాటన్ చీజ్ షర్ట్ శ్వేదంతో తడిసిపోతోంది. వాళ్లు వచ్చి అరగంట అయినట్లు గుర్తుగా గోడ గడియారం ఠంగున గంట కొట్టింది. నా చూపులకే శక్తి ఉంటే దాన్ని అక్కడనుండి కదలకుండా ఆపేయాలనిపించింది.

రామనాథన్ గడియారంవైపూ, గీతవైపూ, ఆ తర్వాత నా వైపూ పోలీసు కటకటాల వెనుకనున్న దొంగలవైపు చూసినట్లు చూశాడు.



వెళ్లిపోయాడు.

రామనాథన్ పిళ్లై మండిపడుతూ, "సివిల్స్ ఒద్దు ... మిలట్రీ వాడిని చూసుకో! సివిల్స్‌కి, మనకీ చాలా తేడాలుంటాయి. మనం గడియారాన్నిబట్టి పనులు చేస్తాం. వాళ్లు వాళ్ల పనులనుబట్టి గడియారాన్ని మారుస్తూంటారు. వాళ్ల ఇంటిముందు లాన్ ఎంత అపసవ్యంగా ఉంటుందో, వాడి తలమీద వెంట్రుకలు అంత అపసవ్యంగా ఉంటాయి. వాళ్ల ఇళ్లల్లో కార్పెట్స్ కింద దుమ్ములా మనసుల్లో బద్ధకాలు పేరుకునిపోయి ఉంటాయి. గ్రాసోపర్‌కీ, ఏంట్‌కీ మధ్య ఉన్నంత తేడా సివిల్స్‌కీ, సర్వీస్ పీపుల్‌కీ మధ్యన ఉంటుంది!" అంటూ 'వెర్టి బ్రేట్స్, ఇన్ వెర్టిబ్రేట్స్ మధ్యనున్న తేడాలు గుర్తించుము' అంటే ఎనిమిదో క్లాసులో ఉన్నప్పుడు నిలువుగా గీత కొట్టి నేను ఉత్సాహంగా రాసినట్లుగా వర్ణించి చక్కాపోయాడు.

మిత్రుడికి ప్రాణగండం తప్పిందని తెలిశాక కులాసాగా వచ్చిన రాకేష్‌ని గీత తిట్టి, ఏడ్చి, ఆపై అలిగిన అతన్ని ఓపిగ్గా బతిమాలి, సినిమాకి తీసుకెళ్లింది.


రెండవసారి గీత రాకేష్‌ని తీసుకుని చెన్నై వెళ్లింది. పొద్దుటే సాంబారు ఇడ్లీ తిన్న రాకేష్‌కి మార్చు చేసి డీసెంట్రీ పట్టుకోవడంతో పెళ్లి చూపులకి రానన్నాడు.

కూతురి బలవంతంమీద అతన్ని ఇంటికి ఆహ్వానించిన రామనాథన్ అతను రాలేనని ఫోన్ చేయడంతో మండిపడి "ఈసారి అతన్ని కోర్టులో కలుస్తానని చెప్పు! ఈ సివిలియన్స్‌కి అవతలివాడి టైమ్ వాడి గెడ్డంమీద వెంట్రుకతో సమానం! ఒక్క సూట్ తగిలించానంటే అప్పుడు తెలుసుకుంటాడు టైమ్ సెన్స్!" అంటూ భరతనాట్యం చేశాడుట!

గీత అర్జెంటుగా రాకేష్‌ని డాక్టర్‌కి చూపించి ఓ సర్టిఫికెట్ రాయించి ప్రొడ్యూస్ చేస్తే కానీ ఆయన శాంతించలేదుట.

మూడవసారి పాపం, గీత తన తల్లికి ఫోన్లమీద ఫోన్లు, ఉత్తరాలమీద ఉత్తరాలు రాసి తండ్రి రాకేష్‌ని కలవడానికి ఒప్పించగలిగింది.

పెళ్లి చూపులలాంటి కార్యక్రమం మా ఇంట్లోనే ఏర్పాటయింది. రామనాథన్ గురించి ఇదివరకే బాగా విని ఉండడంతో నేనూ, మా ఆయనా ఇల్లంతా తెగ శుభ్రం చేశాం. హిట్ పట్టుకుని కార్గిల్‌లో సైన్యంలా ఈగల్నీ దోమల్నీ వెంటాడి వెంటాడి చంపాము. కార్పెట్ కింద దుమ్మూ ... చెవి వెనకాల పొడవుగా పెరిగిన వెంట్రుకలూ .... అస్తవ్యస్తంగా పెరిగిన చెట్లు ... డిసిప్లిన్ లేని కుక్క .... హాట్ డ్రింక్స్ లేని పార్టీ ... ఇవన్నీ ఆయన ఇష్టపడని విషయాలు కాబట్టే తగిన జాగ్రత్తలు తీసుకున్నాం. కాఫీ ట్రే తీసుకొచ్చే పనిమనిషికి



కూడా ఎలా నడవాలో ట్రైనింగ్ ఇచ్చాం. ఇన్ని చేసినా ఫలితం దక్కలేదు.

పదింటికల్లా వస్తానన్న రామనాథన్ గోడమీద గంటల గడియారం ఠంగుఠంగున గంటలు కొట్టడం ప్రారంభించేలోపే మా వాకిట్లో ఉన్నాడు.

సాదరంగా ఆహ్వానించి ఆర్మీ పీపుల్‌ని ఇద్దరం మా శక్తికొద్దీ మెచ్చుకున్నాం. పనిమనిషి అస్సలు నడుం తిప్పకుండా స్ట్రైట్‌గా నడుస్తూ వచ్చి కాఫీలందించింది. గీత తల్లి మా ఇంటిని చాలా మెచ్చుకుంది. అంతా సవ్యంగానే జరుగుతోందనుకుని తృప్తిపడ్డాం. కానీ గీత మొహంలో టెన్షన్, ఆమె వేసుకున్న కాటన్ చీజ్ షర్ట్ స్వేదంతో తడిసిపోతోంది. వాళ్లు వచ్చి అరగంట అయినట్లు గుర్తుగా గోడ గడియారం ఠంగున గంట కొట్టింది. నా చూపులకే శక్తి ఉంటే దాన్ని అక్కడనుండి కదలకుండా ఆపేయాలనిపించింది.

రామనాథన్ గడియారంవైపూ, గీతవైపూ, ఆ తర్వాత నా వైపూ పోలీసు కటకటాల వెనుకనున్న దొంగలవైపు చూసినట్లు చూశాడు. ఆ తర్వాత లేచి నిలబడి గీతతో ఇంగ్లీషులో "మొదట అతన్ని మనిషిలా జీవించడం నేర్చుకోమను ... ఆ తర్వాత పెళ్లి విషయం ఆలోచించుకోమను!" అని భార్యవైపు చూసి బయలుదేరమన్నాడు.

నేనూ, మా ఆయనా లంచ్‌కి ఉండమని ఎంత ప్రాధేయపడినా ఈ మూడ్‌లో ఇక్కడ ఉండటం సభ్యత కాదని వెళ్లిపోయాడు.

వాళ్ల కారు అలా వెళ్లిందో, లేదో ఇలా రాకేష్ మోటార్ సైకిల్ వచ్చి ఆగింది. వగరుస్తూ వచ్చి, "ఉన్నారా?" అని అడిగాడు.

నేను జరిగినదంతా చెప్పాను.

"ఛ! పొద్దుటే కరెంటు లేదు. దాంతో నీళ్లు లేవు. ఎదురు అపార్ట్‌మెంట్ నుండి తెచ్చుకుని స్నానం చేసేసరికి ఆలస్యం అయింది. తొమ్మిదింటినుండి తొమ్మిదీ నలభై వరకూ ట్రాఫిక్ జామ్‌లో చిక్కుపడ్డాను. ఆ తర్వాత రోడ్డుమీద ఏదో ధర్నా .... జులూస్ ... ముందు సి.ఎం. కారూ .... అలా ఆలస్యం అయింది. ఇవన్నీ మిలట్రీ ఆఫీసర్‌కెలా అర్థమవుతాయి?" అన్నాడు బాధగా.

నిజంపైన వేళ్లాడగట్టిన దీపగుచ్ఛంలాంటిది. అందరం దానివైపు చూస్తాం కానీ, చూసే కోణాలు వేరు! ఎవరి మటుకు వాళ్లకి చూడాల్సిన కోణం అదే అనిపిస్తుంది.

రాకేష్ ఆ రోజు ఇంకాస్త ముందుగా లేచి తయారై వస్తే ఇలా జరిగేది కాదు. కానీ అతని మనస్తత్వం ఈ వాదనని అంగీకరించదు. అలాగే ఒక క్రమబద్ధమైన జీవితానికి అలవాటుపడ్డ రామనాథన్; ఏ మాత్రం క్రమం తప్పినా ఓర్చుకోలేడు. మధ్యలో గీత చాలా నలిగిపోతోంది.

ఆ రోజు రాత్రి మా ఆయనతో "మనం చిన్న విషయాలు అనుకునేవి ఎంత ప్రధానమైన సమస్యలుగా రూపుదాలుస్తాయో చూశావా?" అన్నాను.

"ఈసారి రాకేష్‌ని తీసుకుని నేను రామనాథన్ దగ్గరకి వెళ్తాను! ఎలాగైనా ఒప్పిస్తాను!" అన్నాడు.

000

గీత చాలా సంతోషంగా వచ్చి మాకు స్వీట్స్ ఇచ్చింది. రామనాథన్ ఎలాగైతేనేం రాకేష్‌ని చూశాక పెళ్లికి ఒప్పుకున్నాడు.






దివాకర్

రాకేష్ ఈ విషయం తన తల్లిదండ్రులకి చెప్పడానికి ఢిల్లీ వెళ్లాడు.

"సివిల్ మేరేజ్ చేసుకుని దగ్గరవాళ్లకి డిన్నర్ ఇస్తాం. ఆడంబరంగా చేసుకోవడం నాకు ఇష్టం ఉండదు!" అంది గీత.

మాకూ అదే సరైన పద్ధతి అనిపించింది. ముఖ్యంగా ఆచార వ్యవహారాల్లో ఉండే తేడాలవల్ల వచ్చే సమస్యలను నివారించవచ్చు.

ఇదంతా చూస్తున్న మా అత్తగారు గీత వెళ్లిపోయాక నాతో "ఒకే రాష్ట్రం, ఒకే భాషా, ఒకే కులం, శాఖా అయిన మనవాళ్లకి కూడా మీది తూర్పనీ, మాది పడమరనీ, వాళ్లది కృష్ణాజిల్లా అనీ ఇలా రకరకాలుగా భేదాలుంటాయే, పద్ధతుల్లో కూడా బోలెడు వ్యత్యాసం ఉంటుందే ... మరి వీళ్లకి ఆ సమస్యలు రావా?" అని అడిగారు.

నాకు నవ్వొచ్చింది. మా పెళ్లయిన కొత్తల్లో ఆవిడ నన్ను "మీ తూర్పు గోదావరి జిల్లా వాళ్లు అదరగండం మనుషులు!" అనేది. అలాగే అమ్మావాళ్లు "పడమటాళ్లు ఉద్దండపిండాలు!" అనేవారు.

"ఇవన్నీ మన తెలుగువాళ్లకే అత్తయ్యా!" అన్నాను.

ఆవిడ అంతగా సమాధానపడినట్లు నాకు అనిపించలేదు.

రామనాథన్ పిల్లె పెళ్లి త్వరగా చెయ్యాలని ఆత్రుతపడుతూ గీతకి ఆ వారంలో రెండుమూడుసార్లు ఫోన్ చేశాడు.

రాకేష్ యథాప్రకారం నాలుగు రోజుల్లో వస్తానన్నవాడు వారం రోజులకి గానీ రాలేదు. రాగానే మాకు ఫోన్ చేసి తన అపార్ట్‌మెంట్‌కి రమ్మన్నాడు.

మేం వెళ్లేసరికి గీత కూడా అక్కడే ఉంది. కానీ వాతావరణం ఎప్పటిలా లేదు. గాలి కూడా ఘనీభవించినట్లు అదో రకమైన భావరహిత స్థితిలో ఉంది.

రాకేష్ మొహం చూసి కొంపదీసి వాళ్ల పెద్దవాళ్లు పెళ్లి కాదనలేదు కదా అనుకున్నాం.

"ఏమైంది రాకేష్?" అడిగాను.

రాకేష్ చెప్పడానికి ప్రయత్నించాడు కానీ చెప్పలేకపోయాడు. అతని కళ్లు ఎర్రగా ఉన్నాయి. సన్నగా కంపిస్తున్నాడు. ఎప్పుడూ హుషారుగా ఉండే అతను అంత వేదనలో ఉండగా చూడటం అదే మొదటిసారి.

మా ఆయన నెమ్మదిగా "పెద్దవాళ్లు ఒప్పుకోలేదా?" అని అడిగాడు.

అతను ఒప్పుకోలేదన్నట్లు తల అడ్డంగా తిప్పాడు.

నేను బరస్టయి "ఈ పెద్దవాళ్లు ఎప్పుడూ ఇంతే! గీత తల్లిదండ్రుల్ని ఒప్పించినట్లే ఒప్పిద్దాం. దానికే ఇంత దిగులుపడితే ఎలా? ఆ అమ్మాయి ఏమైపోతుందీ?" అన్నాను.

గీత నవ్వి "అక్కా .... ఆవేశపడి ప్రయోజనం లేదు. వాళ్ల ఇష్టప్రకారమే కానీ!" అంది.

"ఏవిటి నువ్వు మాట్లాడుతున్నదీ?" ఈసారి మా ఆయన ఇరిటేట్ అయ్యాడు.

రాకేష్ గొంతు విప్పాడు. "వాళ్లు ఈ పెళ్లి ఎందుకు వద్దన్నారో తెలుసా? తెలిస్తే ఇలా మాట్లాడలేవు!" అన్నాడు.

"నాకు తెలుసు! 'అమ్మాయి తమిళియన్, మనం కాశ్మీరీవాళ్లం ... అలవాట్లూ, పద్ధతులూ, సాంప్రదాయం ... కలవ్వ' అని ఉంటారు. ఇవన్నీ మీరు ఆలోచించినవేగా!" అన్నాను.

గీత వారిస్తూ, "అవన్నీ అనలేదక్కా! చాలా రీజనబుల్ రీజన్ ఇచ్చారు వాళ్ల నాన్నగారు. రాకేష్ నన్ను పెళ్లి చేసుకోకపోతే మా మధ్య ఫిజికల్‌గా రిలేషన్ ఉండదు, అంతే! మేం ఎప్పటికీ మంచి ఫ్రెండ్స్‌గా ఉండటానికి అభ్యంతరమేం ఉంటుందీ? వెళ్లి వాళ్ల నాన్నగారి కోరిక ప్రకారమే వాళ్ల వాళ్ల అమ్మాయిని చేసుకోనీ!" అంది.

"అంత రీజన్ ఏవిటో?" కాస్త కోపంగా అన్నాను.

రాకేష్ వణుకుతున్న గొంతుతో "మా నాన్న ఈ విషయం వినగానే నా చేతులు పట్టుకుని... 'ఒరే! మన కాశ్మీరీపండిట్స్ చాలా మంది మిలిటెంట్స్ చేతిలో హతం అయిపోగా మిగిలిన కొద్దిమందిమీ ఇలా ఉన్న ఊరూ, ఆస్తీ అన్నీ వదిలి వలస వచ్చేశాం. ఈ నాలుగు కుటుంబాలూ సంబంధాలు కలుపుకుని పిల్లలకు పెళ్లిళ్లు చేస్తేనేరా మనం అంతరించకుండా ఉండేదీ! నా కోసం కాదు, మన పండిట్స్ వంశం కోసం అర్థిస్తున్నాను ... మన కులంలో అమ్మాయిని చేసుకోరా!' అన్నాడు. అమ్మ కూడా ఏడుస్తూ బతిమాలింది. ఏం చెప్పాలో నాకు తోచలేదు. గీతతో మాట్లాడదామని ఇలా వచ్చాను!" అన్నాడు.

ఎంతో స్థిరంగా "వాళ్లు చెప్పినదే కరెక్ట్! ఎన్నో ఏళ్లుగా జాతిచరిత్రలో భాగమైన కాశ్మీరీ పండిట్స్ అంతరించిపోకూడదు. సంప్రదాయాన్నీ సంస్కృతినీ కాపాడడమూ దేశభక్తే! నువ్వు వాళ్లమాట వినాల్సిందే రాకేష్!" అంటున్న గీతన్ను చూస్తుంటే ...

సివిలియన్స్‌కీ, ఆర్మీవాళ్లకీ ఉన్న తేడా తెలిసినట్లనిపించింది.

ఎవరో చేసిన పాపాలకి ... వేరెవరో బలి అయిపోవడం అంటే ఇదేనేమో అనుకుని ఇంటికి తిరుగుమొహం పట్టాము. రాకేష్ తండ్రి వాదనను కాదనగలమా?

■

